మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## మల్లన్న ఆలయం కిటకిట



**కొమురవెల్లి, నవంబరు3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కార్తీక మాసం మొదటి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి అభిషేకాలు, నిత్య కళ్యాణం, పట్నాలు వేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్క ఎల్లమ్మకు బోనాలు సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికా రులు తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, ఒగ్గు పూజారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి జాతీయ అవార్డు



**రామచంద్రాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:** రామచంద్రాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుఉ ఆహ్మద్ హసిబుద్దీన్ వికార్ ఆదివారం జాతీయ అవార్డును అందుకున్నారు. న్యూ ఢిల్లీ కౌమి ఉర్దూ శిక్షక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధా నోత్సవంలో ఆహ్మద్ హసిబుద్దీన్ వికార్‌కు జాతీయ అవార్డును ప్రధానం చేశారు. గతంలో సైతం మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డులు అందుకున్న ఆహ్మద్ హసిబుద్దీన్ వికార్‌ను పాఠవాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి పిపి రాథోడ్ పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వాసలు అలీ గుజ్జర్, ఉపాధ్యక్షులు కుమార్ దాస్ రానా, ప్రొఫెసర్ నసీమ అక్బర్ శాంతి ఆరోరా తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**కంది, నవంబరు 3, ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన వరి ధాన్యంను వరుస క్రమంలో తూకం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలకు వరి ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు రైతులకు టార్పిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూఇంచారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తుర్పుర బట్టి యంత్రాలు, అకాల వర్షాలకు ధాన్యం తడకుండా టార్పిన్లు సిద్దంగా ఉంచాలని కేంద్రం నిర్వహకులకు సూచించారు. తాలు తప్ప చెత్త రాకుండా రైతులు తమ పంటలను కోత కోసే సమయంలో మిషన్ ఆర్‌పిఎం 18 కన్నా ఎక్కువగా ఉండేలా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ఆర్‌పిఎం 18 కంటే తక్కువగా ఉంటే పంట సరైన రీతిలో కోత కోయబడకుండా సమస్యలు తెలెత్తె అవకాశాలు ఉంటాయన్నారు. ధాన్యం తేమ శాతం 17 లోపు ఉన్నప్పుడే తూకం వేయాలని సూచించారు. అధిక తేమ ఉన్న ధాన్యం నాణ్యత కోల్పోతుందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి వెంటనే ట్యాబ్‌లలో నిర్వాహకులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులక ఇబ్బందులు కల్గకండా ఏర్పాటు చేయాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కొండలరావు, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



మవినెల్లిలో విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, నవంబరు 3, ప్రభాతవార్త:** మండల పరధిలోని మవినెల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ శివానంద శివాచార్య మహారాజ్ ఆద్వర్యంలో శ్రీ భాగ్యవంతి దేవాలలయంలో అమ్మవారి విగ్రహావిష్కరణ, శిఖర ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు ఆదివారం భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. పూజా కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరు కాగా ఉత్సవ కమిటి బాధ్యులు మాజీ ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అమ్మవారికి అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంగమేశ్వర్ మహారాజ్, మాజీ జడ్పీటిసి సభ్యులు రాథోడ్ లక్ష్మిబాయి రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్‌లు విఠల్‌రావు, అంజిరెడ్డి, నాయకులు బసవరాజ్, రమేష్ పాటిల్, పండరి, శ్రీధర్ పాటిల్, భక్తులు పాల్గొన్నారు.

ఫోటోరైటప్02. సెల్‌ఫోన్ అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ నాయక్

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అరగంటలో అందజేత

**హుస్నాబాద్‌రూరల్, నవంబరు3, ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు మల్లయ్య ఆదివారం మధ్యాహ్నం సమయంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రూ 20వేలు విలువ చేసే సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై స్పందించిన హుస్నాబాద్ సీఐ కోంద్ర శ్రీనివాస్, ఎస్ఐ తోట మహేష్‌ల ఆదేశాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిగ్నల్ ఆధారంగా అరగంటలోని పట్టుకుని హెడ్ కానిస్టేబుల్ మొగిలినాయక్ ద్వార బాదిత వ్యక్తికి అందజేశారు. పోయిందనుకున్న సెల్‌ఫోన్‌ను అరగంటలోనే బాదితులనికి అందజేసిన విషయం తెలుసుకున్న పలువురు పోలీస్‌లపై ప్రశంసలు కురిపిస్తున్నారు. విధినిర్వహణలో చాకచక్యం వహించిన హెడ్ కానిస్టేబుల్ మొగిలినాయక్‌ను స్థానిక ఎసిపి వాసాల సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తోట మహేష్‌లు అభినందించారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు : ఎస్ఐ

**అక్కన్నపేట, నవంబరు3, ప్రభాతవార్త**

మండలంలోని రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోచవద్దని ఎస్ఐ విజయ్‌భాస్కర్ హెచ్చరించారు. ఆదివారం రోజున అక్కన్నపేట మండలంలోని రామవరం రోడ్డు నుండి హుస్నాబాద్ వైపు వెళ్తున్న ఆయన ప్రధాన రహదారిపై ధాన్యం ఆరబోయడాన్ని గమనించి అక్కడ ఆగారు. ఈ సందర్భంగా ధాన్యం ఆరబోసిన రైతులను పిలిపించి రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల జరిగే అనర్థాలను గురించి వివరించారు. రాత్రి సమయంలో ఈ రోడ్డు గుండా వచ్చే వారికి ధాన్యం కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగిన విషయాలను గుర్తు చేశారు. ధాన్యం ఆరబోయడం వల్ల వాహణ దారులకు ఎలాంటి ప్రమాదం జరిగినా రైతులే బాద్యత వహించాల్సి వస్తుందని రైతులు ప్రమాదాలకు కారణం కాకూడదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై కాకుండా కాళీ స్థలాలలో ఆరబెట్టుకోవాలని సూచించారు. అనంతరం రామవరం గ్రామానికి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన నాలుగు సిసి కెమోరాలు పనిచేయడం లేదని తెలుసుకుని వెంటనే బాగు చేయించారు.



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ విజయ్ భాస్కర్

# ఉద్యోగులను నమ్మించి మోసం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలనిచ్చి..అధికారంలోకి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులను నమ్మించి మోసం చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉపాధ్యా యుడు రాములు పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పిఆర్‌సిని ప్రకటిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రిటైర్మెంట్ డబ్బులు, రావాల్సిన పూర్తి బెనిఫిట్స్ అందించకపోవడం సరికాదన్నారు. అన్ని ఉద్యోగాలకు విరమరణ ఉంటుంది కానీ ఉపాధ్యాయ వృత్తికి విరమణ ఉండదన్నారు. డిసెంబర్ వరకు ఉద్యోగులకు 6 డిఎలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుందని ఒక డిఎ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యా యులకు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చడం లేదన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు జి.తిరుపతిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హరీష్‌రావు

# వైద్య శాఖ అన్ని అంశాలలో వంద శాతం పురోగతి ఉండాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 ప్రభాతవార్త:**

వైద్య శాఖకు సంబంధించి అన్ని అంశాలలో వంద శాతం పురోగతి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి సమయపాలన పాటించాలని, అన్ని సంబర్ సెంటర్‌లు, పీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రోజుకు రెండు పీహెచ్‌సీల వైద్యాధికారులతో, ఏఎన్ఎం, ఆశాలతో ఓపీ, గర్భిణీ నమోదు తదితర అంశాలలో మెరుగైన సేవలు అందేలా సమీక్షించాలని అన్నారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారులు సబ్ సెంటర్ సిబ్బందితో రివ్యూ చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల మీద ప్రత్యేక దృష్టి పెట్టి వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలలో 1 సంవత్సరం నుండి 15 సంవత్సరాలు గల విద్యార్థులను ఆర్‌బీఎస్‌కే టీం క్షుణ్ణంగా పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితుల పైన నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సాధారణ ప్రసవాలు జరగాలని, ప్రైవేట్ ఆసుపత్రిలో అధిక సంఖ్యలో సీ సెక్షన్‌లు జరుగుతున్నాయని, దీని మీద వైద్య శాఖ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రైవేట్ గైనకాలజిస్ట్ డాక్టర్స్, సిబ్బందికి ప్రసూతి సేవలపై ఓరియెంటేషన్ ఇచ్చి సాధారణ ప్రసవాలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. సబ్ సెంటర్, పీహెచ్‌సీల వారీగా వైద్య సేవలు మెరుగుపడాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు 100 శాతం ఎన్‌సీడీ స్క్రీనింగ్ సేవలు పూర్తి చేయాలన్నారు. ఆర్‌బీఎస్‌కే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ అమలు చేయాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యవకుల వరుస హత్యలు.. భయాందోళనలో పట్టణవాసులు

**రెండు హత్యలు చేసింది ఒకరేనా.. అనేకోనంలో పోలీసుల దర్యాప్తు**
**అనుమానాదస్పద స్థితలో ఎవరు కనిపించిన సమాచారం అందించాలి : ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**

**చిన్నశంకరంపేట, 3, ప్రభాతవార్త:**

అది ఒక పారిశ్రామిక వాడ, నిత్యం జనసంచారం ఉండే ప్రదేశం, పరిశ్రమలకు ముడి సరుకులు తీసుకోని లారీలు నిత్యం వస్తూ వెలుతుంటాయి. అలాంటి ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు ఒక యువకుడుని బస్టాండులో అతి కిరాతకంగా తల పగల గోట్టి చంపారు. ఈ సంఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.... పట్టణ శివారులోని అనంతపద్మనాభస్వామి గుట్ట వద్దఉన్న బస్టాండులో గుర్తు తెలియని యువకుడిని దుండగులు అతి కిరాతకంగా బండరాయితో కోట్టి చంపి నిప్పు పెట్టారు. ఉదయం 8గంటల సమయంలో రోడ్డుపై వెలుతున్న వారు గమనించి ఎస్సై నారాయణగౌడ్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్‌లు పరిశీలించారు. క్లూస్ టీం ఆదారాలను సేకరించారు. పోలీసు జాగిలం బస్టాండు చుట్టూ తిరిగి పక్కన ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం వరకు వెల్లి వచ్చింది. పది రోజుల క్రితం పట్టణంలోని ఆసుపత్రి ఆవరణలో సైతం గుర్తు తెలియని యువకుడిని దుండగులు చంపి నిప్పు పెట్టారు. ఆ కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో అదే మాదిరి మరో హత్య జరగడంతో కేసు చేదించడం పోలీసులకు సవాలుగా మారింది. పోలీసు స్టేషన్‌కు కూత వేటులో రెండు హత్యలు జరగడంతో పట్టణవాసులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. రెండు హత్యలు చేసింది ఒకరేనా లేక ఎవరైన ఉద్దేశపూర్వకంగా చంపారా అనే కోనంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానస్పందంగా మీ పరిసరాల చుట్టూ ఎవరు కనిపించిన పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ పట్టణ వాసులకు సూచించారు. చిన్నశంకరంపేటలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిని అనుకోని ఉన్న బస్టాండులో హత్య జరగడంతో పలు రకాల అనుమానాలకు దారి తీస్తుంది. సీసీ కెమోరాలు లేని చోట చూసుకోని దుండగులు హత్యలు చేస్తున్నాడ అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిందుతులను అతి త్వరలో పట్టుకుంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# సీటు వచ్చినా ఫీజులు కట్టలేని స్థితిలో గిరిజన విద్యార్థిని

**దాతల చేయూత కోసం ఎదురు చూస్తున్న ఎంబిబిఎస్ విద్యార్థిని కుటుంబం**



తల్లితండ్రులతో కలసి దాతల కోసం వేడుకుంటున్న దేవి

**హుస్నాబాద్‌రూరల్ , నవంబరు3 , ప్రభాతవార్త**

రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీపట్టి నీట్ ఫలితాలలో సత్తా చాటింది ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థిని. నీట్‌లో 447 మార్కులు సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వస్తుందని ఆశపడింది. అయితే ఆర్థికంగా లేని కుటుంబంలో పుట్టిన తనకు ప్రయివేట్ మెడికల్ కళాశాలలో సీటు రావడంతో రెక్కాడితే కాని డొక్కాడని వారి తల్లితండ్రుల పరిస్థితులను చూస్తూ డాక్టర్ కావాలనే ఆశయం నెరవేరుతోందో లేదో అని ఆందోళన చెందుతోంది. వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ మండలంలోని బల్లునాయక్‌తండాకు చెందిన లావుడ్య లక్ష్మీ రమేష్‌లకు ఇద్దరు కూతుళ్లు వారు కూలీ పనులు చేసుకుంటు వారిద్దరి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిపించారు. వారి పెద్ద కూతురు బీ ఫార్మసీ చేస్తుండగా చిన్న కూతురు దేవి చిన్నతనం నుండే అడవి బిడ్డల కష్టాలు చూసి వైద్యురాలు కావాలనే ఆశయంతో తల్లితండ్రులకు కూలీ పనులలో సహకరించడంతో పాటు రాత్రి సమయంలో యూట్యూబ్‌లో పాఠాలు వింటూ ఇటీవల జరిగిన నీట్ ఫలితాలలో మంచి మార్కులు సాధించింది. కానీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించలేక పోగా సిద్దిపేట జిల్లా మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. అయితే ప్రైవేట్ కళాశాలలో ఎంబిబిఎస్ చదువు పూర్తి చేసేందుకు సంవత్సరానికి రూ 3లక్షల 50వేల నుండి 4 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంత స్తోమత వారి తల్లితండ్రులకు లేకపోవడంతో చదువుపై ఆసక్తి ఉన్నా ఫీజులు కట్టే నాదులు లేక చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారి తల్లితండ్రులతో కలసి తమగోడును ప్రభాతవార్త ఎదుట వెల్లబోసుకుంది. వారి కూతురు చదువు కోసం వారి తల్లితండ్రులు అడవిలో ఉన్న పెంకుటిల్లు అమ్ముదామనున్నా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేరని తన చదువు విషయంలో దాతలు ఎవరైనా ఉంటే సహకరించాలని వారికి తమ జీవితాంతం రుణపడి ఉంటామని ప్రాదేయపడుతున్నారు.

# కొనుగోలు కేంద్రాలలో సరిపడా గోనె సంచులు పంపిణీ చేయాలి

**కొమురవెల్లి, నవంబరు 3, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ఐనాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వారం రోజులు గడిచిపోతున్న నేటికి గోనె సంచులు దిక్కులేవని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు తాడూరి రవీందర్ అన్నారు. ఆదివారం ఐనాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో వడ్లు కొనుగోలు చేస్తారో లేదో అన్న అనుమానంతో రైతులు గ్రామీణ ప్రాంతాల్లో వడ్లను దళారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తేలు ఇస్తారి, సున్నంనయాదగిరి, కానుగుల రాజు, పాశం చంద్రయ్య, దయ్యాల అనిల్, మల్లం యాదయ్య, శివయ్య, తేలు బాలమల్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న హరీష్‌రావు

## ప్రతిభగల విద్యార్థులకు హరీష్‌రావు అభినందనలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** వికారాబాద్‌లో ఇటీవల జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్. తైక్వాండో పోటీలలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. అండర్-14 విభాగంలో పి.పురంధర, అండర్-20 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎం.పునీత్‌రెడ్డి అండర్-29 కేజీల విభాగంలో సిల్వర్, ఈ.విశాంత్ అండర్ 32 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, టి.తనీష్ వినయ్ అండర్ 41 కేజీల విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అభినందించారు. గోల్డ్ మెడల్ సాధించిన పి.పురందర ఈనెల 8 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్ విదిషలో జరిగే 68వ జాతీయస్థాయి ఎస్.జి.ఎఫ్.తైక్వాండో పోటీలకు ఎంపిక కావడంతో అభినందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మారెడ్డి రవీందర్‌రెడ్డి, రాజనర్సు, సాయిరాం, జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలి

**-కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు నాగులగారి మల్లేషం గౌడ్**

కొల్చారం, నవంబర్ 3 ప్రభాతవార్త: చిలుముల సుహాసిని రెడ్డి మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీ స్వీకరణ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేడు (సోమవారం) ఉదయం 11 గంటలకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మెదక్ పట్టణంలో ప్రమాణ స్వీకారం ఉటుందని తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డిలు హాజరు కానున్నారని అన్నారు. కావున కొల్చారం మండలంలోని మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో చర్మన్‌లు, మండల కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం

**తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సింహులు**




పార్టీ సభ్యత్వాలను అందిస్తున్న నాయకులు

**హుస్నాబాద్‌టౌన్, నవంబరు3, ప్రభాతవార్త**

తెలంగాణలో తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. ఆదివారం రోజున పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నియోజకవర్గ ఇంచార్జీ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు సమాన న్యాయం జరగాలంటే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, నారాలోకేష్‌లు పార్టీ కార్యకర్తలకు సంబందించిన ప్రమాద భీమా (ఇన్సూరెన్)ను 2లక్షల నుండి ఐదు లక్షలకు పెంచారని తెలిపారు. గతంలో ఈ ప్రాంతం నుండే సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం వివిధ పార్టీల నుండి టిడిపిలో చేరిన వారికి సభ్యత్వాలను అందజేశారు. సభ్యత్వాలు పొందిన ప్రతీ నాయకుడు పార్టీని పూర్వ వైభవానికి తీసుకెళ్లేందుకు నారా చంద్రబాబులాగానే పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు దామెర సత్యం, మాజీ విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవిందర్, నాయకులు కోటి, బొల్లుమల్ల సదానందం, భాస్కరశర్మ, శ్రీధర్, వరియోగుల శ్రీనివాస్, శంకర్, మల్లాగౌడ్, వెంకటేష్, ఫారుక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కాస్మోటిక్ చార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం




**హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3, ప్రభాతవార్త**

ఎస్సి, ఎస్టి, బిసి, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి సందర్భంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్(గిరిజన గురుకుల పాఠశాల) లో పాఠశాల ప్రిన్సిపాల్ రాజు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారుకున్నారు. చార్జీలు పెంచిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల సొసైటీ కార్యదర్శులకు ప్రిన్సిపాల్ వీణచందన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల అధ్యాపక బృధం పాల్గొన్నారు.



సదర్ కరపత్రం విడుదల విడుదల చేస్తున్న ఈటెల రాజేందర్

## సదర్ వేడుకలకు ఎంపి ఈటల రాజేందర్‌కు ఆహ్వానం

**జగద్గిరిగుట్ట, నవంబరు 3, ప్రభాతవార్త :** అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జగద్గిరిగుట్టలో ప్రతి సంవత్సరంలాగే వైభవంగా సదర్ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎంపీ ఈటెల రాజేందర్ చేతుల మీదుగా సదర్ కరపత్రం విడుదలచేసి వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ యాదవులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్య యాదవ్, సత్యనారాయణ యాదవ్, జగదీష్ యాదవ్, రాజు యాదవ్, ఆంజనేయులు యాదవ్, బీరప్ప, నాగరాజు యాదవ్, రాజు, శ్రీకాంత్ యాదవ్, రవి యాదవ్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు



కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, నవంబరు 3 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అడప భరణి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక కౌతం, శివ కౌతం, రామాయణం, రామదాసు కీర్తన, పుష్పాంజలి, నమశ్శివాయతేయ్, ఇందరికి భయము, ఇచ్చు చేయి, జత్వి స్వరం, శృంగార లహరి, సాధించేన్, జయజయ రామనాథ తదితర అంశాలను దృవీక, రచన, కీర్తన, నిహారిక, నందిని, శిరీష, అద్భుతి, వేదశ్రీ, లావణ్య, హాసిని, మనోజ్ఞ, జ్యోతి, హృదయ తదితరులు తమ ప్రదర్శనలో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## అంతర్ కళాశాల కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు

### -ఛాంపియన్‌గా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలు

**చిక్కడపల్లి నవంబరు 3 ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. నగరంలోని లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో 34 జట్లు పాల్గొనగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల జట్టు ఓవరాల్‌గా రెండవ స్థానంలో నిలిచింది. ఇందులో భాగంగా ఆదివారం పతకాలను గెలుచుకున్న వారిని బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ సత్కరించి ప్రసంగించారు. ఇలాంటి పోటీలలో మరెన్నో పతకాలను గెలుచుకుని కళాశాలకు పేరును తీసుకురావాలన్నారు. క్రీడల్లో రాణిస్తున్న వారిని తమ కళాశాల ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ టి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎంబిఎ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎ.పురుషోత్తమ్ బంగారు పతకం, బిఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థి కె.కౌశిక్ ప్రణయ్ రజత పతాకన్ని, బికాం ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.పుష్కర్ యాదవ్ కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్, డిప్ల విజేతలకు పతకాలు, సర్టిఫికేట్లను అందించారు.

## గాంధీనగర్ డివిజన్‌లో సదర్ సయ్యాట-2024



సదర్ సయ్యాటలో పాల్గొన్న పూస రాజు, వినయకుమార్ తదితరులు

**చిక్కడపల్లి, నవంబరు 3 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో స్వామి వివేకానందనగర్ బస్తీలో ఆదివారం నిర్వహించిన సదర్ సయ్యాట-2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిజెవైఎం డివిజన్ ఉపాధ్యక్షుడు సంపత్‌యాదవ్, రాజు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ కుమార్‌లు హాజరయ్యారు. సదర్ సయ్యాట-2024లో దున్నపోతు విన్యాసాలను నిర్వహించారు. అనంతరం సదర్ నిర్వాహకులు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేశ్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, సాయికుమార్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, ఆకుల అభిషేక్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కళా,సేవా రంగాలలో మహిళలకు పాధాన్యత కల్పించాలి

### -విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రజనీ

**చిక్కడపల్లి, నవంబరు 2ప్రభాతవార్త:** ప్రముఖ సంఘసేవకురాలు అరిగపూడి కృష్ణకుమారి సేవలు అజరామరమని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజనీ అన్నారు. అరిగపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘసేవకురాలు అరిగపూడి కృష్ణకుమారి స్మారక జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ టి.రజనీ హాజరై వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించి అభినందించి ప్రసంగించారు. మహిళలు త్యాగమూర్తులే కాదని, కళా,సేవా రంగాలలో మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అరిగపూడి కృష్ణకుమారి, అరిగపూడి విజయకుమార్ దంపతుల సేవలు చిరస్థాయిగా గుర్తుండి పోతాయన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ టి.రజనీ, జస్టిస్ బి.చంద్రకుమార్, ఆదాయపన్నుల శాఖ విశ్రాంత కమిషనర్ నరసింహప్ప, పూర్వ పోలీసు ఉన్నతాధికారి బి.వి.రమణకుమార్, తెలుగు వన్ నిర్మాత కంఠంనేని రవిశంకర్, పాత్రికేయులు వైఎస్‌ఆర్.శర్మ, ప్రముఖ కవి డాక్టర్ జల్ది విద్యాధరరావు, డాక్టర్ నాళేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహిత్య, కళా, జర్నలిజం, సేవారంగాలలో విశేష ప్రతిభ కనబర్చిన డాక్టర్ రామకృష్ణ కోడూరి, భగీరథ, గీతాంజలి, రామచందర్‌నాయక్, వి.శ్రీనివాస్, కె.అల్పన జ్యోతి, రాంబాబు, శ్రీరామ్‌దత్తి, విజయభాస్కర్‌లకు కృష్ణకుమారి స్మారక జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాధాకుసుమ, పద్మశ్రీలత, శ్రీపేరిలు నిర్వహించిన కవిసమ్మేళనం అలరించింది.



వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.రజనీ

# హబ్సిగూడ సర్కిల్‌లో మరో 5 సబ్ స్టేషన్లు ఏర్పాటు

### ఎస్ఇ బ్రహ్మం

**ఉప్పల్, నవంబరు 3 ప్రభాతవార్త :** హబ్సిగూడ సర్కిల్ పరిధిలో రూ.100 కోట్లతో విద్యుత్ సంస్కరణలు చేపడుతున్నామని హబ్సిగూడ సూపరిటెండెంట్ ఇంజనీర్ బ్రహ్మం పేర్కొన్నారు. ఆదివారం ఉప్పల్‌లోని ఎస్ఇ కార్యాలయంలో జరిగిన విద్యుత్ వినియోగదారుల సదస్సులో ఎస్ఇ బ్రహ్మం, డిఇ టి.సుబ్బారావు, ఎడిఇలు బాలకృష్ణ, దశరధ, నరేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్ఇ బ్రహ్మం మాట్లాడుతూ హబ్సిగూడ సర్కిల్‌లో కొత్తగా మరో ఐదు సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మేడిపల్లి, వెంకటాపూర్, బంగారు మైసమ్మ టెంపుల్, ఉప్పల్ భగాయత్, చిలుకానగర్‌లలో నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా మరో 500 ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన 33 కెవి విద్యుత్ వైర్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిరో బిల్లు కారణంగా ప్రతి నెలా రూ.5 కోట్ల 71లక్షల భారం పడుతుందని, దీనిని ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. మొత్తం ఒక లక్ష 28 వేల మంది జిరో బిల్లుకు అర్హత ఉన్నారని, వీరిలో





మాట్లాడుతున ౨ ఎస్ఇ

ఒక లక్ష 10వేల మందికి జిరో బిల్లు అమలు అవుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ బిల్లులు తీసే సమయంలో ఎక్కువ రోజులు గడిచినా 30 రోజులకే బిల్లు వేస్తామని తెలిపారు. కొత్తగా విద్యుత్ లైన్లు వేయాలంటే జిహెచ్ఎంసి నుంచి తగు రుసుం చెల్లించాలని కోరారు. రామంతాపూర్ భగాయత్‌లో ప్యానల్ బోర్డులు ఇవ్వడం లేదని, ఇంటి అనుమతులు లేవని తిరస్కరిస్తున్నారని కాలనీ నేత అల్లాడి నిరంజన్‌గౌడ్, లక్ష్మయ్య, రమేష్‌లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ పాలసీ ప్రకారం నడుచుకుంటున్నామని, కొత్తగా బాక్స్‌లు ఇవ్వడం లేదని ఎస్ఇ బ్రహ్మం తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. ప్రజలనుంచి 12 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఎఇలు కిరణ్‌కుమార, వినయ్‌కుమార్‌రెడ్డి, బి.నాగరాజు, గణేష్, కె.నాగరాజు, వేణు గోపాల్, నిఖిల్, రాములు, పలువురు వినియో గదారులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం : డిఇ

**నాంపల్లి, నవంబరు 3 ప్రభాతవార్త :** ప్రజలకు 24 గంటలు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని, ఈ విషయంలో వారికి ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు యుద్ధప్రాతిపదిక నిర్దిష్ట చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఏసిగార్డ్స్ డీఇ విజయకుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ పంపిణీలో ఎలాంటి రాజీలేకుండా సిబ్బంది అహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు రెడ్‌హిల్స్‌లోని విద్యుత్ ఆఫీసు ఆవరణలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వారి సమస్యల పరిష్కార దిశగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కరెంటు సరఫరాలో అంతరాయాలు, వీధిదీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లింగ్, ట్రాన్స్‌ఫార్మర్ల సంబంధిత పలుఫిర్యాదులు చేశారు. ఆయా ఫిర్యాదులను అధికారులు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీనిచ్చారు.





మాట్లాడుతున్న డిఇ విజయకుమార్

అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ ఎక్కడా విద్యుత్ పంపిణీకి అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని, సాంకేతిక లోపం, ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమ సిబ్బంది మరమ్మత్తులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్నారని వివరించారు. ప్రజలు తమ ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొస్తే సాధ్యమైన త్వరగా పరిష్కార చర్యలు గైకొంటామని, ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే వెంటనే బాగుచేయడమే కాక ప్రత్యామ్నాయంగా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అయితే వినియోగదారులు నెల నెలా తమ బిల్లులను సకాలంలో చెల్లించాలని, తద్వారా మెరుగైన సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు అసిస్టెంట్ ఇంజనీర్లు చిలుక నారాయణ, సత్యనారాయణ, నజియా సుల్తానా తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# 6 నుంచి అన్నివర్గాల సమాచార సేకరణ ప్రారంభం

### బిసి కమిషన్ రాష్ట్ర చైర్మన్ నిరంజన్

**చిక్కడపల్లి, నవంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి బీసీలతో పాటు సమాజంలోని అన్నివర్గాల వారి సమాచారాన్ని సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ పి.నిరంజన్ అన్నారు. ఇంటింటికి వచ్చి ఎన్యుమరేటర్స్ ఈ సమాచారాన్ని సేకరిస్తారని అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ గ్రామీణబ్యాంక్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నిరంజన్ మాట్లాడుతూ మొత్తం జనాభాలో ఎవరి జనాభా ఎంత ఉంటుందో సమాచార సేకరణలో తెలిసిపోతుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో బ్యాంకులను జాతీయం చేశారని అన్నారు. కొన్ని కులాల జీవన విధానం గురించి చెబుతుంటే చాలా బాధ కలుగుతోందని, ఏ జిల్లాకు వెళ్లినా తమిళనాడు తరహాలో చేయాలనే ప్రస్తావన తెస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న సేవలు గొప్పవని, ఇంకా మరింతగా ప్రజలకు





మాట్లాడుతున్న నిరంజన్

సేవలందించేందుకు బ్యాంక్ ఉద్యోగులు కృషిచేయాలన్నారు. ఆలిండియా రూరల్‌బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణబ్యాంకుల్లో పనిచేస్తున్న ఓబీసీ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రగతిని సాధించామని, ఉద్యోగుల సమస్యలను మరింతగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ వై.శోభ, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ రూరల్ బ్యాంక్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మమ్మాయి మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.కరుణానిధి, వర్కింగ్‌ప్రెసిడెంట్ చిన్నయ్య, అధ్యక్షుడు బి.రవికాంత్, టిఎస్ ఓబీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వి.దారకర్ణాచారి, బ్యాంక్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్, విశ్రాంత జీఎం పి.శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌బిఐ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

## సెపక్‌తక్రా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

### రాష్ట్ర అధ్యక్షుడిగా పెరిక సురేష్

**హైదరాబాద్, నవంబరు 3,ప్రభాతవార్త:**

తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పెరిక సురేష్ కుమార్ ఎన్నికైయ్యారు. ఆదివారం ఫతేమైదాన్‌లో జరిగిన ఎన్నికల్లో 21 మందితో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ సెపక్‌తక్రా అడ్‌హక్ కమిటీ చైర్మన్ జగన్నాథ్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి డీఎల్ నరసింహారావు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అబ్జర్వర్ ఓంకార్ యాదవ్, ఒలంపిక్ అసోసియేషన్ పరాగ్ వాద్వికార్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. కొత్త కార్యవర్గం నాలుగేళ్లపాటు కొనసాగనుంది.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ సెపక్ తక్రాలో రాష్ట్రాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన అధ్యక్షునిగా సురేష్‌కుమార్ తోపాటు వైస్ ప్రెసిడెంట్ లుగా జగన్నాథ్‌స్వామి, శ్రీధర్, సంజీవ్‌రెడ్డి, కంచర్ల అనిత, జనరల్ సెక్రటరీగా శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా జితేంద్రనాథ్, జరీఫుద్దీన్, విజయ్‌బాస్కర్‌రెడ్డి, శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొరిడె శ్రీకాంత్, ట్రెజరర్‌గా మీనం విక్షేకుమార్, మరో 8 మందిని ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**ఉప్పల్, నవంబరు 3 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్ కాలనీల అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి రూ.52లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆదివారం సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టిపిసిసి ప్రతినిధి తౌఫిక్, సుర్వి మురళీగౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఉపేందర్‌రెడ్డి, జలీల్ పాషా, శివాలయం చైర్మన్ నామ్ రాజిరెడ్డి, గరిక సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రామంతాపూర్ భగాయత్ కాలనీలలో బాలకృష్ణనగర్ బంగారు మైసమ్మ ఆలయం, కేటిఆర్‌నగర్‌లో డ్రైనేజీ లైన్లు నిర్మాణానికి రూ. 52.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరుచేశారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు సురేష్, సంధ్యారాణి, గాయత్రి, సతీష్‌గౌడ్, పూస సత్తయ్య, భాస్కర్, శాగ శ్రీధర్, జిల్లు, సందీప్, భాస్కర్, అరుణ్, సాయి, నరేష్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, సాయి, షకీల్, కాలనీ నేతలు స్వామి, వేణుగోపాల్‌చారి, రేవు కృష్ణయ్య, తిక్కారెడ్డి, నరసింహా, నాగ మల్లయ్య, నాగరాజు, జి.స్వామి, రాంచందర్, వినోద్, నాగిరెడ్డి, రాజేష్‌గౌడ్, శంకర్‌గౌడ్, శ్యామ్, చందు, లింగం, జనార్దన్, శంకర్, రామరావు, సుభాష్, హేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు నిరంతరం మెరుగైన సేవలు

### టిజిఎస్‌పిడిసిఎల్ రంగారెడ్డి జోన్ సిఈ పాండ్యా

**హైదరాబాద్, నవంబరు 3,ప్రభాతవార్త:**

విద్యుత్ వినియోగదారులకు నిరంతరం మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని రంగారెడ్డిజోన్ సిఈ పాండ్యా అన్నారు. ఈమేరకు ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కెపిహెచ్‌బిలోని రంగారెడ్డి జోనల్ కార్యాలయం, సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమావేశం ఘనంగా నిర్వహించారు. దీనికి కెపిహెచ్‌బి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్ కు సంబంధించిన గేటెడ్ కమ్యూనిటీ, వివిధ రకాల వినియోగదారులు హాజరయ్యారు. ఈసందర్భంగా వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, అపాయకారంగా వున్న ట్రాన్స్ఫార్మర్ లు, ట్రాఫిక్ కు ఇబ్బంది గా వున్న స్తంభం లను తొలగించడం, ట్రాన్స్ఫార్మర్ ల స్థాయి లను పెంచడం వంటి వాటి గురుంచి ప్రస్తావించారు. కేపీహెచ్ బి ఇండిస్ వన్ సిటీ నుంచి నరసింహారావు అనే వినియోగదారుడు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది అన్ని సమయాలలో అందుబాటులో వుండి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కారిస్తున్నారని వ్యాఖ్యనించారు. ఈసందర్భంగాఎస్ఈ పాండ్య





మాట్లాడుతున్న సిఈ పాండ్యా

మాట్లాడుతూ డిపార్ట్మెంట్ అందిస్తున్న సేవలు గురుంచి వివరించారు. అదేవిధంగా వినియోగదారులకు ఏ సమస్య వున్నా ట్విట్టర్, 1912, టీజీఎస్‌పిడీసీల్ యాప్‌ల ద్వారా తెలియ చేయాలని కోరారు. అలాగే విద్యుత్ సిబ్బంది వినియోగ దారుల సమస్య లను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారి చేసారు. ఈ సందర్భంగా వినియోగ దారులు విద్యుత్ సంస్థ కు అందిస్తున్న సహాయ సహకారాలకు ఎంవిబి చారి అనే వినియోగదారున్ని విద్యుత్ అధికారులు శాలువ, పుష్ప గుచ్చం తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సైబర్‌సిటీ ఎస్ఈ చంద్రశేఖర్ డీఈలు యాదగిరి, శ్యాం కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింహా, తదితరులు

## 17న ఎఎన్ఎంల పోరాట కార్యాచరణ

**సైఫాబాద్, నవంబరు 3 ప్రభాతవార్త:** 17 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌హెచ్ఎం (జాతీయ ఆరోగ్య మిషన్)లో పనిచేస్తున్న 2వ ఎఎన్ఎంల సమస్యలు పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించేందుకు ఈనెల 17న రంగారెడ్డి జిల్లా, శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఈ మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను 2వ ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బి.శ్యామల, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పొనుగంటి పర్వతాలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎం.నర్సింహ్మ మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వృతి వివక్షతోపాటు మానసిక వత్తిడికి గురువుతున్నారని, ప్రభుత్వాలు మారినా వీరి జీవితాల్లో ఏలాంటి మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో ఎఎన్ఎంల డిమాండ్లపై విస్తృతంగా చర్చించి పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

## నేటి తరం ఆచార్యులు, విద్యార్థులకు హరిగోపాల్ మార్గదర్శకులు



హరిగోపాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆచార్యులు, పూర్వవిద్యార్థులు

**సైఫాబాద్, నవంబరు 3 ప్రభాతవార్త:** దేశ, విదేశాల్లో పలు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు విశేషమైన బోధనలుచేసిన ఆచార్య కొండూరు హరిగోపాల్ నేటితరం ఆచార్యులకు, విద్యార్థులకు మార్గదర్శకులని విశ్రాంత కమాండర్ వై.వి.వి.ప్రసాద్ చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉస్మానియా, ఆంధ్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేసి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్‌గా, విదేశాల్లో ఎష్యన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీనియర్ కన్సలేటెంట్ (బ్యాంకాంగ్-థాయిలాండ్)లో విద్యార్థులకు బోధనతోపాటు పలు గ్రంథాల రచనలలో ఎంతో తోడ్పాటును అందించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆదివారం నాడిక్కడ మోక్ష బ్యాక్వెట్ హాల్‌లో జరిగిన స్వర్గీయ కొండూరు హరిగోపాల్ సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంతో మంది విద్యార్థులకు పిహెచ్‌డి రావడానికి తన వంతు కృషి చేశారని, అనేక దేశాలలో విస్తృతంగా బోధనలుచేసి తిరిగి వచ్చిన కొండూరు మాతృదేశంలో కూడా మెనేజ్‌మెంట్ కళాశాలను ఏర్పాటు చేసి ఉత్తమ విద్యార్థులను దేశానికి అందించడంలో ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు. హరిగోపాల్ కుమారుడు కె.రఘు సందీప్ (లండన్) మాట్లాడుతూ తన తండ్రి నెర్పిన సనాతన ధర్మాని ్న, భారతీయ విలువలను తాము పాటిస్తున్నామని చెప్పారు. ఈ సభలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, కె.సంస్కృత్, భారతీదేవి, డాక్టర్ రమేష్, హరిత, ప్రొఫెసర్ భట్, పూర్వ విద్యార్థులు అనేక మంది పాల్గొన్నారు. తొలుత వారు కొండూరు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

### చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు

## సమగ్ర విధానాన్ని రూపొందించాలి

**చిక్కడపల్లి, నవంబరు 3 ప్రభాతవార్త:** జస్టిస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(జెఎంఐ) ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజలు, నిపుణులు, వరద బాధితులు, ఇతర వాటాదారులతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఫ్లడ్‌ఫ్రీ హైదరాబాద్ అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో పలువురు ప్రముఖులు వివిధ అంశాలపై తమతమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వరదలు లేని హైదరాబాద్ కోసం జెఎంఐ ఆధ్వర్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సమావేశం అభిప్రాయపడింది. ముఖ్యంగా నగరంలో ప్రజల శ్రేయస్సును కాపాడుతూ, చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ ద్వారా వరదలను నివారించడానికి అందరూ భాగస్వాములు కావాలని, ఇందుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని సమావేశం డిమాండ్ చేసింది. శాస్త్రీయంగా ప్రామాణికంగా మార్గదర్శకాల ప్రకారం చెరువులు, కుంటలు, నాలాలతో సహా అన్ని నీటి మూలాలపై సర్వే నిర్వహించాలని, అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని, బాధితులకు ముందస్తు పరిహారం అందించడంతో పాటు పునరావాసం కల్పించాలని సమావేశం అభిప్రాయపడింది. అదే విధంగా చెరువులు, కుంటలను పూర్వస్థితికి తిరిగి తీసుకురావాలని, వాటిని శుద్ధి చేయడంతో పాటు మురుగునీటి కాల్వలను బాగుచేసి భవిష్యత్తులో సమస్యలను రాకుండా చూడాలని, నీటి శుద్ధీకరణ త్వరితగతిన చేపట్టాలని, నీటి సమీకరణ జరగాలని, పర్యావరణ చట్టాలను అమలు చేయాలని, నగరంపై ఒత్తిడిని తగ్గించడానికి రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో అవసరమైన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. నీటి మూలాలను ధ్వంసం చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని, చట్టబద్ద పాలన జరగాలని, నిష్పక్షపాతం లేకుండా, సమానత్వాన్ని పాటిస్తూ అక్రమ నిర్మాణాల కూల్చివేతలను అమలు చేయడంతో పాటు ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థాయిలను పరిగణలోకి తీసుకోకుండా, చట్టాన్ని ఉల్లంఘించిన వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. స్థానికంగా స్వపరిపాలనను బలోపేతం చేయడంతో ప్రజలు, స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యం చాలా అవసరమని అభిప్రాయపడింది.

## ఘనంగా విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

### హాజరైన ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు

**హైదరాబాద్, నవంబరు 3,ప్రభాతవార్త:** విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ స్థాపనకు గుర్తుగా టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో విద్యుత్ వినియోగదారుల దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం మింట్ కాంపౌండ్, మెట్రో జోన్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వినియోగదారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని పలు విలువైన సూచనలు, సలహాలు మరియు వారు ఎదుర్కొంటున్న సమస్యలు సంస్థ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇంచార్జి డైరెక్టర్ లు, చీఫ్ ఇంజనీర్లు మాట్లాడుతూ, తమ సంస్థలోని ఆర్టిసన్ నుండి సీఎండీ వరకు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా సేవలందిస్తున్నారన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవల కల్పనకు సంస్థ పరిధిలో చేపట్టే దైనందిన వ్యవహారాల్లో అధునాతన సాంకేతికతను పొందుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముందుగా, వినియోగదారులకు గల హక్కులు, వారి సమస్యల పరిష్కరణ కోసం వున్న ప్రత్యామ్నాయ వేదికల గురించి మెట్రోజోన్ ఛీఫ్ ఇంజనీర్ చక్రపాణి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్‌లు, నంద కుమార్, డా. నర్సింహులు, చీఫ్ ఇంజినీర్లు, సాయి బాబా, వెంకట్, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, వెంకన్న, కరుణాకర్, శ్రీ గోపయ్య, సోమి రెడ్డి, దిలీప్ కుమార్, ఇతర డివిజనల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.





అధికారులకు సమస్యలు వివరిస్తున్న వినియోగదారులు

# హైటెన్షన్‌తో..టెన్షన్..!

**ప్రమాదంగా పరిణమిస్తున్న విద్యుత్ తీగలు**
**పలు ప్రాంతాల్లో తీగలకిందే నిర్మాణాలు**
**-అడ్డగోలు అనుమతులతో పెరుగుతున్న ప్రమాదాలు**

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** నగరంలో హైటెన్షన్ విద్యుత్‌తీగలు ప్రమాదంగా పరిణమిస్తున్నాయి. హైఓల్టేజీ విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెల్లడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. విద్యుత్ తీగల కింద ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు చెబుతున్నా.. అవి ఎక్కడా అమలు కాకపోవడంతో నగరమంతా హైటెన్షన్ విద్యుత్‌తీగల కింద వేలసంఖ్యలో నిర్మాణాలు వెలిశాయి. గతంలో స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదంగా మారిన హైటెన్షన్ విద్యుత్‌తీగలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని నాటి సిఎం ప్రకటించినా.. ఆదిశగా పనులు మాత్రం జరగడంలేదు. దీంతో హైటెన్షన్ తీగలు తొలగించడంలో అధికారుల అలసత్వంతో తరచూ విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా శనివారం పంజాగుట్ట పిఎస్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో పెను ప్రమాదం తప్పింది. స్థానిక వడ్డెర బస్తీ మీదుగా వెళ్తున్న హైటెన్షన్ వైర్లు తెగి రెండు ఇండ్లు, గవర్నమెంట్ స్కూల్ బిల్డింగ్‌పై పడింది. గమనించిన స్థానికులు భయంతో పరుగులు తీశారు. వైర్ తెగిపడటంతో వెంటనే కరెంట్ సప్లై నిలిచిపోవడంతో ప్రాణనష్టం తప్పింది. మూడు గంటల పాటు సప్లై నిలిచిపోయింది. తరుచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చేశారు. హైటెన్షన్ వైర్లు తలొగించాలని డిమాండ్ చేశారు. గతంతో మేడమీద బట్టలు ఆరేస్తున్న మణిలా అనే మహిళపై పడటంతో మృతిచెందిదని, గాలిపటం ఎగరేస్తుండగా మరో బాలుడు మృతి చెందాడని ఇంకా ఎంతమందిని పొట్టనబెట్టుకుంటారని వాపోయారు. వెంటనే వాటిని తొలగించి అండర్‌గ్రౌండ్ లైన్లు వేయాలని డిమాండ్ చేశారు.



**భయంభయంగా స్థానికులు...**

వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ పెరిగినా.. వర్షాకాలంలో గాలి దుమారం వచ్చినా హైటెన్షన్ విద్యుత్ తీగల కింద నివాసముంటున్న ప్రజలు ఎప్పుడు తెగిపడతాయోనని భయాందోళనకు గురవుతున్నారు. నగరంలోని పలుప్రాంతాల్లో తీగలు ఇళ్ల చేరువలో ఉన్నాయి. దీంతో హైటెన్షన్ వైర్ల నుంచి వస్తున్న ఎర్తింగ్‌తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైటెన్షన్ విద్యుత్ తీగల కింద ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలున్నా వాటిని ఎవరూ పటి ంచుకోవడం లేదు. వాటికింద రెండు మూడు అంతస్తులు నిర్మించేటప్పుడు, నోటీసులివ్వాలి ్సన అధికారులు పట్టించుకోకుండా ఉంటూ,ప్రమాదాలు జరిగిన తర్వాత తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారు.

**ప్రమాదకరంగా ఉన్నప్రాంతాలు..**

ఉప్పల్ బీరప్పగడ్డ, చిలుకానగర్ ప్రాంతాల్లో కాలనీల్లోని ఇళ్లపై నుంచే హైటెన ్షన్ తీగలు వెలుతున్నాయి. ఇవి ఉప్పల్ చిలుకానగర్ మీదుగా చర్లపల్లి నాచారం,కుషాయిగూడ పారిశ్రామిక వాడల మీదుగా ఉన్నాయి. కాప్రా సర్కిల్ మల్లాపూర్ నెహ్రూనగర్,అశోక్‌నగర్ కాలనీల మీదుగా ఈ లైన్లు వెలుతునా ్నయి. కాప్రాలో హైటెన్షన్ వైర్లకింద 20కిపైగా కాలనీలు ఉన్నాయి. ఇళ్ల బహుళ అంతస్తులు వెలిశాయి. దీంతో రేడియో ధార్మికతతో పాటు, విద్యుత్‌ఘాతంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్ జోన్ పరిధిలో 113కేవీ విద్యుత్ తీగల నిర్వహణలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్‌తీగల నిర్వహణపై ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్ అధికారుల మధ్య సమన్వయంలేక, ప్రమాదాలకు కారణం తాముకాదంటూ పలుసందర్భాల్లో తప్పించుకుంటున్నారు. ప్రమాదాలకు కారణమైన అధికారులపై ఎలాంటి చర్యలూ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారు.

## నాచారం డివిజన్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**నాచారం, నవంబరు 3 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లోని అన్నిప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేటర్ శాంతిసాయిజన్‌శేఖర్‌తోకలిసి రూ.20లక్షలతో న్యూ అంబేద్కర్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నా మన్నారు. కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ మాట్లా డుతూ న్యూఅంబేద్కర్‌నగర్ బస్తీలో డ్రైనేజీ పను లను పూర్తిచేసి తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యలు లేని డివిజన్‌గా నాచారం డివిజన్‌ను తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు సాయిజన్‌శేఖర్, విఠల్‌యాదవ్, భూపాల్‌రెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, రామకృష్ణ, అశోక్, గణేష్, మంగోల్ శివ, రామచందర్, మారయ్య, పాండు నాయక్, రాజేష్, శివ, రవి, మహేష్, అశోక్,ఆశన్న, దానం వినయ్, హరిప్రసాద్, స్థానికులు అంజి, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు సూక్తులు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవి

**ఎమ్మెల్యే తలసాని**

**సంజీవరెడ్డి నగర్, నవంబరు 3, ప్రభాతవార్త :** ఏసుక్రీస్తు సూక్తులు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవి మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం అమీర్‌పేట డివిజన్ ఎస్‌ఆర్ నగర్‌లోని క్రిస్టియన్ ఫెలోషిప్ చర్చిలో నిర్వహించిన కృతజ్ఞతర్పణల పండుగలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్మార్గంలో పయనించాలి. సాటివారికి సహాయపడాలి అనే ఏసుక్రీస్తు బోధనలను పాటించాలని కోరారు. చిన్న పెద్ద తేడాలేకుండా ప్రతి ఆదివారం చర్చికి వచ్చి ప్రార్థనలు నిర్వహిస్తూ క్రిస్టియన్‌లు క్రమశిక్షణకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. పండుగలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రపంచం మొత్తం జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని అన్నారు. నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో క్రిస్మస్‌ను జరుపుకుంటారనే విషయాన్ని గుర్తుచేశారు. ఎప్పుడు ఏ అవసరమొచ్చిన తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# దాడిచేస్తున్నాయ్...కరుస్తున్నాయ్

**నగర వీధుల్లో కుక్కల స్వైర్య విహారం...రికార్డుల్లోనే నియంత్రణ ఆపరేషన్లు.. సామాన్య ప్రజలకు తప్పని తిప్పలు**



**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త :** హైదరాబాద్ మహానగరంలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. కాలనీలో కుక్కలు చాలా ఇబ్బందులు పెడుతున్నాయి...కుక్కలను పట్టుకుని వెళ్లాలంటూ జిహెచ్‌ఎంసి కాల్‌సెంటర్‌కు ఫోన్ చేస్తే స్పందన ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని నగర వాసులు అంటున్నారు. తాజాగా కుక్కల దాడిలో ఓ చిన్నపిల్లాడు తీవ్రంగా గాయపడ్డాడు. బోరబండ సమీపంలోని అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాణాప్రతాప్‌నగర్‌లో చోటుచేసుకుంది. వీధిలో ఆడుకుంటూ ఇంట్లోకి వెళ్తున్న రెండున్నర ఏళ్ల బాలుడు నవాజ్‌ఖాన్‌పై నాలుగు కుక్కలు ఒక్కసారిగా దాడిచేశాయి. దీంతో చిన్నారి విలవిలలాడిపోయాడు. బాలుడి కేకలు విన్న వికలాంగురాలైన తల్లి వాజిదాబేగం బయటకు వచ్చి ఒక్కసారిగా కేకలు వేసింది. దీంతో కాలనీవాసులు వచ్చి కుక్కలను తరిమి బాలుడిని నీలోఫర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీంతో స్పందించిన జిహెచ్‌ఎంసి అధికారులు హుటాహుటినకాలనికి వెళ్లి కుక్కలను పట్టుకుని పనిలో పడ్డారు.

**నియంత్రణ ఒక్కటే మార్గం...**

కుక్కలకు సంబంధించిన నియంత్రణ ఒక్కటే మార్గం. కానీ ఆ నియ ంత్రణ సక్రమంగా లేకపోవ డంతో ఈ సమస్య ఎదురవుతుంది. కుక్కల నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నామంటూ భారీ గా లెక్కలు చెప్తూ నిధులను ఖర్చు చేస్తున్నారు. కానీ ఫలితం లేదు. ముఖ్యంగా వీటి ప్రత్యేకమైన లెక్కలంటూ లేకపోవడం, ప్రశ్నించే పరిస్థితి లేక పోవడంతో నిధులు భారీగా ఖర్చు అవుతున్నాయి. మహానగర పాలక సంస్థ పరిధిలో కుక్కలను పట్టుకోవడం, వాటికి శస్త్ర చికిత్సలు చేయడం కోసం పెద్ద యంత్రాంగం ఉంది. దీనికి కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించడంతో పాటు కుక్క లను నియంత్రించేందుకు ప్రతి సర్కిల్‌లో వెట ర్నరీ అధికారితో పాటు సిబ్బంది సైతం ఉన్నారు. ఫోన్ చేసిన తరువాత వచ్చి కుక్కలను పట్టుకుని వెళ్లేవారు, కానీ ఇప్పుడు ఎస్‌ఎంఎస్ పంపుతు న్నారు. వాస్తవంగా మాత్రం ఒక్క కుక్కను పట్టు కున్న సంఘటనగానీ, నియంత్రణ చేసిన సంఘ టనలుగానీ కనిపించడం లేదు. అయితే ఈ వీధి కుక్కలను పట్టుకోవడం, వారికి ఆపరేషన్లు, మం దులు, వారం రోజుల పాటు ఆహారం, ఇలా అన్నింటికి కలిపి భారీగానే నిధులను జిహెచ్‌ఎంసి వెచ్చిస్తుంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో కలిపి 75వేలకు పైగా కుక్కకాట్లు నమోదు అవుతున్నాయి. అంటే ప్రతి 100 మంది లో ఒకరు కుక్కకాటుకు గురౌతున్నారు. ప్రతి యేడాది ఈ కాటుగురయ్యేవారితో పాటు మృత్యువాత పడేవారి సంఖ్య కూడా పెరుగుతుంది. అధికారుల లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం సరాసరి 50 వేలు మాత్రమేనంటున్నారు. కానీ ప్రైవేటు ఆసుపత్రులలో 20-30వేల వరకు నమోదును లెక్కలోకి తీసుకోవడం లేదు. వెటర్నరీ విభాగంలో అవినీతి పెరిగిపోవడంతో కుక్కల నిధుల నీళ్లల ఖర్చు అవుతున్నాయి, మరోవైపు

# బాణాసంచాతో బైక్‌పై విన్యాసాలు

**స్పందించిన టిజిఎస్‌ఆర్టీసి ఎండి సజ్జనార్**
**రాయదుర్గం పిఎస్‌లో కేసు నమోదు**



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

**గచ్చిబౌలి, నవంబరు 3 ప్రభాతవార్త:** ఐటి కారిడార్ పరిధిలో అర్ధరాత్రి బైకర్లు మరోసారి రెచ్చిపోయారు. తోటి ప్రయాణికులకు దీపావళి దమాకా చూపిస్తూ భయాందోళనకు గురిచేశారు. ఏకంగా బైక్‌లమీద బాణాసంచా కాలుస్తూ విన్యాసాలతో హడలెత్తించారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడం,ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ ఈ ఘటనపై స్పందించడంతో రాయదుర్గం పోలీసులు బైకర్ల మీద కేసులు నమోదు చేశారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... వారాంతాలు ఐటి కారిడార్ రహదారులు బైక్ స్టంట్లకు వేదికలుగా మారుతున్నాయి. పోలీసులు ఎంతగా నిఘా పెట్టినా, బైక్ రైడర్ల మీద కేసులు నమోదు చేసినా బైక్ రేసింగ్‌లు, స్టంట్లు మాత్రం ఆగడం లేదు. తాజాగా వారాంతంలో భాగంగా శనివారం అర్ధరాత్రి ఐటి కారిడార్ నాలెడ్జ్ సిటీలో జరిగిన దీపావళి స్పెషల్ బైక్ స్టంట్ల వీడియోలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. కేబుల్ బ్రిడ్జీ మీదుగా ఐటి కారిడార్‌లోకి ప్రవేశించిన యువకులు బైక్ స్టంట్లు చేస్తూ హడలెత్తించారు. నంబర్ ప్లేట్ లేని బైక్ మీద ముందు బాణాసంచా కాలు ్చతూ బైక్ స్టంట్లు చేశారు. షాట్స్ ప్యాకెట్‌ను బైక్ హెడ్ లైట్‌కు కట్టి, వెలిగించగా, బాణాసంచా కాలు తుండగా, బైక్‌మీద స్టంట్లుచేస్తూ వీరంగం సృష్టించారు. మరోబైక్ వెనుక కూర్చున్న యువకుడు షాట్స్ పట్టుకోగా, వాహనాల రద్దీ మధ్య బైక్ స్టంట్లు చేస్తూ షాట్స్ వెలలిగించారు. వీరి కారణంగా నాలెడ్జ్ సిటీలో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ స్టంట్లను ఘట్‌కేసర్‌కు చెందిన ఓ వ్యక్తి వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా, ఆర్‌టిసి ఎండి విసి.సజ్జనార్ స్పందించి యువకుల చర్యను తప్పుబట్టారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాలతో రాయదుర్గం పోలీసులు ఈ ప్రమాదకర స్టంట్లపై కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు. బిఎన్ ఎస్‌ఎస్ 121 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ వెంకన్న తెలిపారు.

**బైక్ రేసులు.. 36 మందిపై కేసు నమోదు...**

మరోవైపు ఐటి కారిడార్ నాలెడ్జ సిటీలో బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న 36 మందిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో బిగ్గరగా అరుస్తూ, భారీ శబ్దంతో బైక్ రేసింగ్‌లు, స్టంట్లు చేస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేశారు. అప్పటికే అక్కడ నిఘా పెట్టిన రాయదుర్గం పోలీసులు బైక్ రేసర్లలను నలువైపుల నుంచి చుట్టుముట్టి రేసింగ్‌లను అడ్డుకున్నారు. 21 మంది యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు 21 బైక్‌లను సా ్వధీనం చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి సైతం బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న 15మందిని అదుపులోకి తీసుకున ్న పోలీసులు, 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రేసింగ్‌లకు పాల్పడిన యువకులను రిమాండ్‌కు తరలిస్తామని, బైక్‌లను ఆర్‌టిఏ అధికారులకు అప్పగిస్తామని రాయదుర్గం పోలీసులు తెలిపారు. యువత బైక్ రేసింగ్‌లకు పాల్పడకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందని, ఐటి కారిడార్‌లో బైక్ రేసింగ్‌లకు పాల్పడితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ వెంకన్న తెలిపారు.

**వార్త ప్రభావం**

## చిరు వ్యాపారులకు ట్రాఫిక్ పోలీసుల సూచనలు

**బేగంపేట నవంబరు 3,ప్రభాతవార్త :** బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ప్రతి ఆదివారం ఫతేనగర్ బ్రిడ్జితో పాటు బ్రిడ్జి కింద రోడ్డుకు రెండు వైపులా కూరగాయల సంత నిర్వహిస్తుండటంతో ఆ ప్రాంత వాసులు ఆదివారం వచ్చిందంటే గంటల సమయం ట్రాఫిక్ జాంలో చిక్కుకుని ఇబ్బందులు పడేవారు. అయితే ప్రజలు,వాహనదారుల ఇబ్బందులపై అక్టోబరు 28న వార్త హైదరాబాద్ మినిలో కూరగాయల మార్కెట్‌తో వాహనదారుల ఇక్కట్లు,,బ్రిడ్జికి ఇరువైపులా షాపుల ఏర్పాటుతో ట్రాఫిక్ జాం,అనే కథనం ప్రచురితమైంది.ఈ కథనం పై స్పందించిన నార్త్‌జోన్ ఏసీపీ జి.శంకరరాజు సూచనల మేరకు బేగంపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పాపయ్య ఆదివారం సాయంత్రం బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ వద్ద జరుగుతున్న సంతవద్దకు చేరుకుని చిరు వ్యాపారులకు పలు సూచనలు చేసారు.వాహనదారులకు,ప్రజలకు ఇబ్బందులు లేకుండా షాపులు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కల్గిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుకు ఒక వైపు మాత్రమే సంత ఏర్పాటు చేసుకుంటే మరో వైపు ట్రాఫిక్ వెళ్లే అవకాశం ఉంటుందని, తెలియజేసారు. సంతకు వచ్చిన వాహనదారులు కూడా తమ వాహనాలను ఒక చోట పార్కింగ్ చేసుకుని వెళ్లి కూరగాయాలు కొనుగోలు చేయాలని,అలా కాకుండా కొందరు నేరుగా వాహనాలతో సంతలోకి వెళ్తుండటంతో కూడా ట్రాఫిక్ జాం అవుతుందని,అలా చేయవద్దని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పాపయ్య సూచించారు.



మాజీ ఎంపి వి.హనుమంతరావు నివాసంలో జరిగిన సత్యనారాయణ స్వామివ్రతం కేదారేశ్వర నోము కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

## బంజారాహిల్స్ ప్రమాదంలో వ్యక్తి అరెస్ట్

**ప్రమాదానికి కారకుడు అమెరికాలో వ్యాపారి, తెలుగులో కమెడియన్‌గా గుర్తింపు**

**పంజగుట్ట, నవంబరు 3 (ప్రభాతవార్త):** రోడ్డు ప్రమాదం కేసులో ప్రమేయం ఉన్న వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1వ తేదీ సాయంత్రం ఒక కారు బంజారాహిల్స్‌లోని క్యాన్సర్ ఆసుపత్రి నుండి కేబీఆర్ పార్క్ వైపు అతి వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొని, పార్క్ గోడను ఢీకొంది. పెట్రోలింగ్ సిబ్బంది ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ మొదలు పెట్టారు. ప్రమాదంలో అక్కడ పేమెంట్ ధ్వంసం కాగా, పార్క్‌గోడ కూలిపోయి అక్కడ బీభత్సంగా తయారైంది. ప్రమాదానికి గురైంది విదేశీ కారు కావడంతో పాటు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పోలీసులకు యజమాని ఎవరనే విషయంలో మొదట్లో సంశయం ఏర్పడింది. తర్వాత ఒక విరిగిన నంబర్ ప్లేట్ ధ్వంసమైన కారు కిందిభాగంలో పోలీసులకు దొరికింది. వెంటనే ఆ నంబర్ ప్లేట్ ఆధారంగా రవాణాశాఖ అధికారుల సహాయంతో కారు ఎవరిదో పోలీసులు గుర్తించగలిగారు. అత్యంత ఖరీదైన రెడ్‌కలర్ పోర్షే ఏజీ జర్మన్ కారుగా పోలీసులు గుర్తించారు. కాగా ప్రమాదానికి కారణమైన అమెరికాలో వ్యాపారం చేస్తూ, తెలుగులో కమెడియన్‌గా పనిచేస్తున్న ఉత్సవ్‌దీక్షిత్‌గా పోలీసులు గుర్తించి అతనిని అరెస్ట్ చేశారు. అతనిపై పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినటు పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**సికింద్రాబాద్, నవంబరు 3 ప్రభాతవార్త :** గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రి పోలీస్ అవుట్‌పోస్టు పక్కన ఇబ్బంది పడుతుండగా సిబ్బంది గతనెల 30 అడ్మిట్ చేశారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు డార్క్ గ్రీన్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించాడు.

**మరో సఘటనలో...**

గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో స్పృహలేకుండా పడిఉన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... 39 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రింలో స్పృహలేకుండా పడిఉండగా సిబ్బంది ఆస్పత్రిలో చేర్చారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంబంధీకులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

**దోశలో బొద్దింక..నోటీసులు జారీ చేసిన జిహెచ్‌ఎంపి అధికారులు..**

**పంజగుట్ట, నవంబరు 3 (ప్రభాతవార్త):** దోశ తింటుండగా అందులో బొద్దింక ప్రత్యక్ష మవడంతో తింటున్న వ్యక్తి షాక్‌కు గురయ్యాడు. ఆదివారం రాజ్‌భవన్ రోడ్డులోని స్వాతి టిఫెన్ సెంటర్‌లో టిఫిన్ చేయడానికి రాఘవేంద్రకుమార్ అనే వ్యక్తి వెళ్ళాడు. వెళ్ళి దోశ ఆర్డర్ చేశాడు. అనంతరం దోశను తినే సమయంలో బొద్దింక కనిపించింది. వెంటనే ఈ విషయమై టిఫిన్ సెంటర్ యాజమాన్యంను నిలదీయగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఈ విషయమై రాఘవేంద్ర జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా అధికారులు టిఫిన్‌సెంటర్ యాజమాన్యానికి ఈ విషయమై నోటీసులు జారీ చేశారు.





శారదా మల్లేష్‌ను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## బిజెపి దిశ కమిటీ సభ్యురాలిగా శారదామల్లేష్

**మెట్టుగూడ, నవంబరు 3 ప్రభాతవార్త:** బిజేపీ దిశ కమిటీ సభ్యురాలిగా సీనియర్ నాయకురాలు, జిల్లా అధికార ప్రతినిధి శారదామల్లేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో మంత్రి శారదా మల్లేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఎల్లప్పుడు ఆదరిస్తూ మార్గనిర్దేశం చేస్తూ ప్రోత్సహిస్తున్న మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలన్నారు. మంత్రి ఆశయాలకు అనుగుణంగా తాను పనిచేస్తానని చెప్పారు.అదేవిదంగా తనను నిరంతరం ప్రోత్సహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ (సంఘ్)పెద్దలకు, జిల్లా అద్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, డివిజన్ నాయకులకు కృతజ్ఞతలన్నారు. ఈ కార్యక్రమంలో యూ. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు సాలార్‌జంగ్ మ్యూజియంలో**

## ప్రత్యేక పెయింటింగ్స్ ప్రదర్శన

**చార్మినార్, నవంబరు 3 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియం, సంగీతా గుప్త సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పెయింటింగ్స్ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామని సాలార్‌జంగ్ మ్యూజియం కీపర్ డాక్టర్ కుసుం వెల్లడించారు.ఈ నెల మూడవ తేదీ సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు సాలార్‌జంగ్ మ్యూజియంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజినల్ ఇన్‌కమ్ టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిటాలి మధుమిత పెయింటింగ్స్ (ఆది యోగి శివ) ప్రదర్శనను ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు.


**శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో**

## సామూహిక కార్తీక మాస దీపోత్సవం

**బేగంపేట నవంబరు 3, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సామూహిక కార్తీక మాస దీపోత్సవ వేడుకలలో భాగంగా వైభవోపేతంగా వేడుకలు నిర్వహించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ,అటవీ పర్యావరణ శాఖా మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో మొదటి సోమవారం అన్నంతో అభిషేకం జరుగుతుందని మహాకాళీ ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.ప్రతి రోజు ఉదయం రుద్రాభిషేకము నిర్వహించనున్నారు.ప్రతి రోజు సాయంత్రం గం 6ల నుంచి గం 8ల వరకు దేవాలయంలో కార్తీక దీపోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు,ఈ వేడుకలలో జంట నగరాలలోని ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి వేడుకలలో పాల్గొనాలని మనోహర్‌రెడ్డి తెలియజేసారు. సాయంత్రం దీపాలంకరణ, ప్రవచనములు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందని ఈఓ తెలియజేసారు.

## బిసి గురుకుల హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించాలి

**హైదరాబాద్, నవంబరు 3,ప్రభాతవార్త:** రాష్ట్రంలో 295 బీసీకాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవు. కేటాయించిన ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని దారదత్తం చేస్తున్నారని ప్రభుత్వం దానిపై దృష్టిసారించి బిసిగురుకుల హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం బి.సి విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచినందుకు కాలేజీ హాస్టల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్య మంత్రి భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలియ చేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ మెస్‌చార్జీలు పెంచడం వల్ల గురుకులాలు, హాస్టళ్లలో చదువుకొని 7 లక్షల 65వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చుతుంది. కాలేజీ హాస్టళ్ళకు 1500 నుండి 2100, గురుకుల హాస్టళ్ళలో 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు 900 నుండి 1330, 8వ తరగతి నుండి 10వ తరగతి కి 1100 నుండి 1540 పెంచారన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు మంచి మెనూతయారుచేసి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే దొరలకార్లు వెళ్లడానికి ఓవర్లు, స్కైఓవర్స్‌ను వేలకోట్ల రూపాయలతో వెచ్చించి కడుతున్నారు. కానీ చదువుకొని భవిష్యత్తులో ఐఎఎస్, ఐపిఎస్ లు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కావాల్సిన సిన విద్యార్థులను బందెల దొడ్డిలో పశువులను తొలినట్లు ఒక్కొక్క రూంలో 20 నుంచి 50 మందిని వుంచుతున్నారు. దీంతో వారి చదువు, ఆరోగ్యం దెబ్బ తింటుంది కావున సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకదృష్టి సారించి గురుకుల సొంత భవనాలు నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కె. శివ, ఆర్. కవిత, బలరామ్, మల్లేశ్ , సిహెచ్ శ్రీనివాస్, నవీన్ కుమార్, వినయ్ గౌడ్, సురేశ్, శివ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడతున్న ఆర్.కృష్ణయ్య

# తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

**సైఫాబాద్, నవంబరు 3 ప్రభాతవార్త:** తెలుగు భాష పరిరక్షణకు జంటనగరాల్లోని వివిధ సంస్థలు ఏకత్రాటిపైకి వచ్చి కృషి చేయడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి చెప్పారు. యువభారతి చొరవతో అన్ని సంస్థలు కలిసి రావడం చూస్తుంటే వృక్షాలన్ని ఒకచోట చేసి ఫలదానం చేస్తున్నట్లుగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. యువభారతి, వంశీ ఇంటర్‌నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సైఫాబాద్‌లోని ఐఎంపిసి కళాశాల ఆడిటోరియంలో జరిగిన 'తెలుగు వెలుగు' సమాఖ్య కార్యక్రమాలు ప్రథమ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు వెలుగు సమాఖ్య ప్రారంభం తెలుగుభాషను పరిరక్షించుకోవడాని శుభారంభమని, భాషను మనం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తమిళుల భాషాభిమానం చూస్తుంటే సిగ్గు వేస్తుందన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి నాటి ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేసిన కృషిని రమణాచారి వివరించారు. తెలుగు వెలుగు సమాఖ్య నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అత్యంత చైతన్యం కలిగించే కార్యక్రమం అని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సొగసు అనే అంశంపై ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకుడు సుధామ, తెలుగు సాహిత్యంలో అణిముత్యాలాంటి పద్యాలు అనే అంశంపై ప్రముఖ రంగస్థల సినీ నటుడు డా.అక్కిరాజు సుందరరామకృష్ణ ప్రసంగించారు. సమావేశానికి ఆచార్య వంగపల్లి విశ్వనాథం అధ్యక్షత వహించగా వంశీ ఇంటర్‌నేషనల్ సంస్థ అధ్యక్షుడు డా. వంశీ రామరాజు, యువభారతి అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర, ఐఐఎంపి ప్రిన్సిపల్ కూర రఘువీర్, యువభారతి కార్యదర్శి జీడిగుంట, డా.జి.ఎల్.కె. దుర్గ, కిన్నెర సంస్థ అధ్యక్షుడు మద్దాళి రఘురాం, మానస ఆర్ట్స్ అధ్యక్షుడు రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణాచారి

